# సింగపూర్ సింగారం

నా పెళ్ళి ఇంకా మూడు రోజులుందనగా, మా ఇంటి బయటా లోపలా చక్కగా సున్నం కొట్టించారు. సున్నం కొట్టించిన మూడో రోజు, అంటే పెళ్ళి రోజున ప్రొద్దున్నే బయటికి వస్తే మాకు కనపడిందిది. మా ఇంటి బయట గోడమీద అఖిల భారత విద్యార్థి పరిషత్ వాళ్ళు, వాళ్ళ విద్యనీ వితర్కాన్నీ వెల్లవేసి, మా గోడని వాళ్ళ బాబు సొమ్మనుకుని, "ఎబివిపి" అని ఎర్రటి పెద్ద అక్షరాలతో రాసి వెళ్ళిపోయారు. వాళ్ళ సంస్కారానికి చిహ్నంగా, నా పెళ్ళి ఫొటోల్లో మా గోడ మీద, వాళ్ళ "అడ్వర్‌టైజ్‌మెంట్" ఇంకా అలాగే వుంది. ఇది జరిగింది గుంటూర్లో. కొన్ని దశాబ్దాల క్రితం.

ఒక టీనేజ్ అమెరికన్ కుర్రాడు చేతిలో వున్న స్ప్రే పెయింట్ కాన్‌తో ఎదురుగుండా పార్క్ చేసిన ఒక కారు మీద సరదాగా ఒకసారి, అలా కొంచెం పెయింట్ స్ప్రేచేశాడు. వెంటనే అతన్ని పోలీసులు పట్టేసుకున్నారు. మామూలుగా అలాటి అక్రమ ప్రవర్తనకి జరిమానా 250 డాలర్ల పైన. అతనికి జరిమానాతోపాటూ రెండు పిర్రలమీదా కొరడాలతో కొట్టమని తీర్పు ఇచ్చారు. దానిమీద అమెరికాలో అది అమానుషమని విమర్శలు కూడా వచ్చాయి. అయినా శిక్ష ఆగలేదు. ఇది జరిగింది సింగపూర్‌లో. కొన్నేళ్ళ క్రితం.

* * *

ముందు వ్యాపారం పేరుతో బిఛాణా వేసి, తర్వాత జెండా ఎగరేసే అలవాటున్న బ్రిటిష్ సామ్రాజ్యం, ప్రపంచంలోని మిగతా దేశాలలాగానే, సింగపూరుని కూడా ఆక్రమించింది. 1819లో ఈస్టిండియా కంపెనీ తరఫున సర్ టి.ఎస్. రాఫెల్స్ అనే ఆయన సింగపూరుని "కొనేశాడు"ట. 1824లో బ్రిటన్‌లో కలిపేసుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ బారిపడ్డ సింగపూర్ మళ్ళీ 1946లో బ్రిటిష్ కాలనీగా మారింది. 1959లో స్వాతంత్రం సంపాదించుకున్నది.

మొట్టమొదటి ప్రధాన మంత్రి, లీ క్వాన్ యు తన నాయకత్వంలో సింగపూర్‌ని ఎంతో ఆధునికంగానూ ఆర్థికంగానూ ముందుకి తీసుకువెళ్ళాడు. ఆయన 1959నించీ 1990దాకా, ముప్పై ఒక్క సంవత్సరాలు, ప్రధానమంత్రిగా వున్నాడు. ఈ నాడు సింగపూర్ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ఎంతో ప్రముఖమైనది. ప్రపంచంలోని పెద్ద పోర్టులలో ఒకటి. పెట్రోల్ రిఫైనింగ్‌లో ఆసియాఖండంలోనే పెద్దది సింగపూర్. రబ్బర్ టిన్ ఓడలు బట్టలు కెమికల్స్ తయారీలతో ఆర్థికంగా ఎంతో ముందుకిపోయిన దేశం. బ్యాంకింగ్‌లో ఎంతో ప్రసిద్ధి చెందింది. పారిశ్రామికంగా ప్రపంచీకరణలో ప్రముఖమైన పాత్ర వహిస్తున్నది. సెమీకండక్టర్ రంగంలో, ఎలక్ట్రానిక్స్ రంగంలోనూ చకచకా ముందుకి వెడుతున్నది. ఈ దేశంలోని భూమిలో 1.7 శాతం మాత్రమే పంటలు పండించటానికి వాడుతున్నందున, ఆహార పదార్థాలు వేరే దేశాలనించీ తెప్పించుకుంటున్నారు.

"ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్" 1996 జనవరిలో సింగపూర్‌ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా గుర్తించింది. మే 1997లో, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నాలుగు ఆసియా సింహాలు అనబడే సింగపూర్, హాంగ్‌కాంగ్ తైవాన్ దక్షిణ కొరియాలని అభివృద్ధిచెందిన పారిశ్రామిక దేశాలుగా గుర్తించింది.

సింగపూర్ నగర వైశాల్యం 616 చదరపు కిలోమీటర్లు. జనాభా నాలుగు మిలియన్ల పైన. ఇక్కడ మాట్లాడే అధికార భాషలు మలయా చైనీస్ తమిళ్ ఇంగ్లీష్. సింగపూర్ జనాభాలో 77 శాతం చైనీస్, 15 శాతం మలయా, 7 శాతం భారతీయులు. ఆగస్ట్ 1999లో ఈ దేశానికి ఆరవ అధ్యక్షుడిగా ఎన్నికయిన వ్యక్తి ఎస్. ఆర్. నాథన్. ఇండియా సంతతి వారసత్వం వున్న సింగపూర్ వాసి. గో ఛోక్ టాంగ్ ఇప్పటి ప్రధాన మంత్రి. ఇక్కడి ప్రజలకి చదువు, ఆరోగ్యం, గృహ వసతి, జీవన సరళి- మిగతా చాలమంది దేశీయులకన్నా మిన్న అని గర్వంగా చెప్పుకుంటారు. సింగపూర్‌లో విద్యాధికులు 91 శాతం. ఇక్కడ ప్రధాన మతాలు ఐదు. బుద్ధులు, హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు, టావోయిస్టులు.

సింగపూర్ చాల అందమైన దేశం. ఏటా ఎనిమిది మిలియన్ల యాత్రికులు ఈ దేశం చూడటానికి వస్తుంటారుట. టూరిజం వల్ల కూడా ఈ దేశానికి విదేశీ ద్రవ్యం వస్తున్నది. ఏరోడ్డు చూసినా శుభ్రంగా వుంటుంది. రోడ్లంటే గుర్తుకి వచ్చింది. ఇక్కడ నేను చూసిన కొన్ని రోడ్ల పేర్లు మనకి పరిచయమైనవే. అయ్యర్ రాజా ఎక్స్‌ప్రెస్ వే, వీరాసామి రోడ్, మద్రాస్ స్ట్రీట్, చిట్టి రోడ్, చందర్ రోడ్, పెరుమాళ్ రోడ్ లాటివి. ఇక్కడ శ్రీనివాస పెరుమాళ్ గుడి మరియమ్మన్ గుడి కాళీ అమ్మణ్ గుడి, శ్రీ దండాయుధపాణి గుడిలాటి గుళ్ళు కూడా వున్నాయి.

సింగపూర్‌లో లిటిల్ ఇండియా, చైనా టౌన్, ఇంకో పక్కమలయావారి గెలంగ్ సెరాయ్ వున్నాయి. లిటిల్ ఇండియాకి వెళ్ళగానే, లుంగీలు కట్టుకుని, రోడ్డుపక్కనే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న తమిళ మిత్రులు కనిపిస్తారు. చాల షాపుల సైన్ బోర్డులు కూడా తమిళంలోనే వ్రాశారు. రోడ్డు మీదే కూరల షాపులు, పూల దుకాణాలు సింగపూర్‌లో ఒక మద్రాసుని చూపిస్తాయి. అక్కడ ఉడిపి ఆనంద భవన్, దాశప్రకాష్, ఉడ్‌లాండ్స్‌లాటి పేర్లతో రెస్టారెంట్లు కూడా వున్నాయి.

సింగపూర్‌లో ఇండియన్ ఫుడ్ రుచి చూద్దాం అని జాన్, ఫ్రాంక్‌లని తీసుకుని అక్కడ వున్న ఒక ఇండియన్ రెస్టారెంట్‌కి వెళ్ళాను. అక్కడ బఫేలో కూరలు పప్పు సాంబారు రసం పెరుగు అప్పడాలు తమిళ పద్ధతిలో రుచికరంగావున్నాయి జాన్‌కి వేయించిన అప్పడాలు నచ్చాయి. కరకర శబ్దం చేసుకుంటూ ఒక డజను లాగించాడు. ఫ్రాంక్ మసాలా దోశని ముందు చేత్తో తినటమెలాగా అని తటపటాయించినా, అక్కడ అందరూ చేత్తోనే తినటం చూసి, సాంబారులో నంజుకుని మరీ తిన్నాడు. బయటికి వచ్చి, అందరికీ మిఠాయి కిళ్ళీలుకూడా కట్టించాను. ముందు అవి తినటానికి కొంచెం ఇబ్బంది పడ్డా, నోరంతా ఎర్రబడేలా అందరూ కిళ్ళీలని నమిలేసి బాగున్నాయి అన్నారు.

మా ఆఫీసు పని పూర్తికానందున, శని ఆదివారాలు అక్కడే వుండాల్సి వచ్చింది "సింగపూర్‌లో చూడాల్సినవి చాలా వున్నాయి. మీకు కాలక్షేపానికేవీ దిగుల్లేదు" అన్నాడు ఆ వూళ్ళోనే వుండే మా సహోద్యోగి కోక్ వాంగ్.

అతని పర్యవేక్షణలోనే తర్వాతి రెండురోజులూ, అక్కడ చూడవలసినవి చాల చూశాం. పథ్నాలుగవ శతాబ్దంలో సుమత్రదేశ యువరాజు అక్కడ పులులని చూసి సింహాలనుకుని, ఆ ప్రదేశానికి "సింగపుర" అని పేరు పెట్టాడని కోక్ వాంగ్ చెప్పాడు.

"మీ సంస్కృతంలో లయన్ అంటే సింగం కదా" అన్నాడు నాతో. అవున ని తలవూపి, అది ప్రకృతి కాదు వాంగూ వికృతి అనుకున్నాను మనసులో.

ప్రపంచంలోకల్లా ప్రథమ స్థానంలోవున్నవి సింగపూర్‌లో చాల వున్నాయి. అక్కడి ఛాంగి ఎయిర్‌పోర్ట్, సింగపూర్ ఎయిర్ లైన్స్, పోర్ట్ మొదలైనవి నెంబర్ వన్ అంటారు. అలాగే అక్కడ మొట్టమొదటి "రాత్రి సఫారీ", ప్రపంచంలోనే ఎత్తైన మనుష్యులు తయారు చేసిన జలపాతం, ఎత్తైన హోటల్, పెద్ద ఫౌంటెన్ గొప్పగా చెప్పుకునే చూడదగ్గ విశేషాలు. ఛాంగి ఎయిర్‌పోర్ట్‌ని సంవత్సరానికి 25 మిలియన్ల ప్రయాణికులు వాడతారుట. 91 శాతం జనాభా సుఖంగా నివసించే కాంక్రీట్ బిల్డింగుల మధ్య, 164 హెక్టారుల "బుకిత్ టిమా" అనబడే వన్యమృగ సంరక్షణ కేంద్రం, ఎంతో పచ్చగా కన్నుల విందు చేస్తుంది. రంగురంగుల పెద్ద రామచిలకలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తాయి. సింగపూర్ గవర్నమెంట్ 856,000 చెట్లనీ, 4868 హెక్టారుల పార్కులనీ నిర్వహిస్తున్నదిట!

చూడటానికి సమయం వుండాలే కానీ చూడవలసినవాటిలో ముఖ్యమైనవి - సింగపూర్ నది, బోట్ క్వాయ్, మెర్లియన్ పార్క్, పార్లమెంట్ హౌస్, ఏషియన్ సివిలైజేషన్స్ మ్యూజియం, జురాంగ్ పక్షుల పార్కు (ఇక్కడ 600 జాతులకిచెందిన ఎనిమిది వేల పక్షులున్నాయి), సింగపూర్ క్రోకోడిలేరియం (ఇక్కడ వెయ్యి రకాల మొసళ్ళు వున్నాయి), అండర్‌వాటర్ వరల్డ్ (నీళ్ళలో 80 మీటర్ల అడుగున కట్టిన టనెల్‌లో షార్కులు, స్టింగ్‌రేలు, ఈల్స్, తిమింగలాలు, పిరానాలు, డాల్ఫిన్స్ మొదలైన 250 జాతులకి చెందిన 2,500 జలచరాలున్నాయక్కడ) ఇంకా ఇంకా చాల వున్నాయి, వచ్చే యాత్రీకులకందరికీ కన్నుల విందు చేసేటట్టుగా.

"రెండు వారాలు ఇల్లు వదిలి తిరుగుతున్నాను. నేనేమన్నా తనకి కొనకుండా అమెరికా వెడితే, మా ఆవిడ ఇంట్లోకి రానీయదు" అన్నాడు ఫ్రాంక్.

"సింగపూర్ ఒక షాపింగ్ పారడైజ్ .. రండి వెడదాం... "అని కోక్ వాంగ్ మమ్మల్నందర్నీ, ఆర్చర్డ్ రోడ్డుకి తీసుకు వెళ్ళాడు.

అవును అక్కడ దొరకనిదంటూ ఏమీలేదు జేబులు ఖాళీ అయేదాకా, ఆ నియాన్ లైట్ల రోడ్డు మీద తిరిగాం.

కాళ్ళు నెప్పులు పుడుతుంటె హోటల్‌కి చేరుకున్నాం, సింగపూర్ సింగారాన్ని పంచ రంగుల్లో చూసి.

* * *